సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



మక్కబుట్టల చౌరస్తా..
మాచారెడ్డి చౌరస్తాలో ఏ సీజన్‌లో అయినా మక్క కంకులు అందుబాటులో ఉంటాయి. గిరిజనులు కాల్చి విక్రయిస్తుంటారు.
- 12లో ▸



బస్టాండ్‌లో దొంగలు..
కామారెడ్డి బస్టాండ్‌లో దొంగలు రెచ్చిపోతున్నారు. ఏమరుపాటుగా ఉన్న ప్రయాణికులను దోచుకుని పారిపోతున్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.4 /17.7
వాతావరణం
ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి అర్చరీ పోటీలు

దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి అర్చరీ పోటీలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి జిల్లా అర్చరీ అసోసియేషన్ కార్యదర్శి నర్సింహారెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి సీనియర్, జూనియర్ విభాగాలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు శనివారం ఉదయం 8 గంటలలోపు గడికోటలో అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. నాలుగు ఫొటోలు, ఆధార్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకుని రావాలని సూచించారు.

వలంటీర్లుగా ఎంపిక

కామారెడ్డి అర్బన్: తమ కళాశాల విద్యార్థులు 58 మంది డిజిటల్ ఈక్విటీ ఫౌండేషన్ వలంటీర్లుగా ఎంపికయ్యారని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. వీరు తమ చదువును కొనసాగిస్తూనే సామాజిక బాధ్యతగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ లిటరసీపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిజిటల్ ఈక్విటీ ఫౌండేషన్ ప్రతినిధులు ఓంకార్‌నాథ్, నిలయ, టీఎస్‌కేసీ సమన్వయకర్త ఫర్హీన్ ఫాతిమ, మెంటార్ అజహరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి కళాశాలకు దసరా సెలవులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్)కు శనివారం నుంచి దసరా సెలవులు ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. 25వ తేదీ వరకు సెలవులు ఉంటాయని, 26న కళాశాల యథావిధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ సెలవులు కళాశాలలోని డిగ్రీ, పీజీ విద్యార్థులకు వర్తిస్తాయని తెలిపారు.

16 నుంచి ‘టాస్’ పరీక్షలు

కామారెడ్డి టౌన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) ఆధ్వర్యంలో 16వ తేదీనుంచి పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని డీఈవో ఎస్.రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేది వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారి సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, కామారెడ్డి: పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. జిల్లాలో ఆయా విభాగాలకు సంబంధించి 418 మంది కానిస్టేబుళ్లుగా ఎంపికైన విషయం తెలిసిందే. జిల్లా పోలీస్ కార్యాలయంలో వారి సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నారు. తొలిరోజు 240 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. శుక్రవారం ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

డీసీసీబీ ఉద్యోగులకు పదోన్నతులు



సుభాష్‌నగర్ : డీసీసీబీ హెచ్‌ఆర్ పాలసీ కి అనుగుణంగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. ఈమేరకు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నలుగురు అసిస్టెంట్ మేనేజర్లకు మేనేజర్లుగా, 32 మంది క్లర్కులకు అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతి కల్పించారు. ఐబీపీఎస్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన వారికి చైర్మన్ అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. పదోన్నతి పొందిన వారికి చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో గజానంద్, ప్రొఫెషనల్ డైరెక్టర్ భూషణ్‌రెడ్డి, టీఎస్ క్యాబ్ ఏజీఎం సురేష్ పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ ఆర్‌ఐ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాలో సౌత్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మీసాల రాజు, రెవెన్యూ శాఖలో ప్రైవేట్ ఉద్యోగి హరీశ్ గురువారం ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని బంటు రామరాజుకు ఉన్న సర్వే నెంబర్ 2944/ఏలో 16 గుంట భూమి కోర్టు కేసులో ప్రొహిబిషన్‌లో ఉంది. ప్రొహిబిషన్ నుంచి తొలగించేందుకు ఆర్‌ఐ రాజు రూ. 10 వేలు డిమాండ్ చేయగా రూ. 8 వేలకు ఒప్పందం కుదిరింది. అయితే ఆర్‌ఐ డబ్బులు డిమాండ్ చేయడంతో బంటు రామరాజు ఏసీబీని ఆశ్రయించారు. గురువారం మధ్యాహ్నం ప్రైవేట్ ఉద్యోగి రూ.8 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆర్‌ఐ రాజు ఆదేశాల మేరకు డబ్బులు తీసుకున్నట్లు హరీశ్ చెప్పడంతో ఆర్‌ఐ రాజు, హరీశ్‌పై కేసు నమోదు చేశారు.

స్పీడు పెంచిన కారు

- కామారెడ్డి నియోజకవర్గంపై మరింత ఫోకస్
- పార్టీ కార్యక్రమాల కోసం ఫంక్షన్ హాల్
- మీడియాకు సమాచారం ఇచ్చేందుకు ఓ కార్యాలయం
- ముఖ్య నేతల బస కోసం ఇళ్లు అద్దెకు తీసుకుంటున్న నేతలు




కామారెడ్డిలో బీఆర్‌ఎస్ అద్దెకు తీసుకున్న ఫంక్షన్ హాల్

సాక్షి, కామారెడ్డి: సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంపై బీఆర్‌ఎస్ నాయకత్వం ఫోకస్ పెట్టింది. కార్యక్రమాలను వేగవంతం చేసింది. వంద మంది ఓటర్లకు ఒకరు చొప్పున పోలింగ్ బూత్‌కు పది మంది బాధ్యులను నియమిస్తున్నారు. ఈ పదిమంది కమిటీలో కొరు ఇన్‌చార్జిగా ఉంటారు. నియోజకవర్గంలో మొత్తం 266 బూత్‌లకు కమిటీలను వేసి, ఇన్‌చార్జిలను నియమించనున్నారు. వారంతా పార్టీ నిర్దేశించే కార్యక్రమాలను అమలు చేస్తారు. పార్టీ కార్యకలాపాల కోసం జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న శుభం ఫంక్షన్ హాల్‌ను అద్దెకు తీసుకున్నారు. ఎన్నికలు పూర్తయ్యేదాకా అన్నీ అక్కడి నుంచే నడిపించనున్నారు. అలాగే మీడియాకు సమాచారం ఇవ్వడానికి విద్యానగర్‌లోని ఓ అపార్టుమెంటులో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు పార్టీ ముఖ్య నేతలు వచ్చినపుడు ఉండడానికి వీలుగా పలు ఇళ్లను అద్దెకు తీసుకుంటున్నారు. రెండు మూడు రోజుల్లో అద్దె ఇళ్లను ఎంపిక చేసి అందులో మకాం పెడతారు. మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంతో ప్రచార పనులు వేగవంతమయ్యాయి. సీఎంవో నుంచి ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి రెగ్యులర్‌గా వచ్చిపోతున్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ముఖ్య నేతలను సమన్వయం చేస్తూ కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించారు.

ముఖ్య నేతలతో సమావేశం నిర్వహణకు..

నియోజకవర్గంలో ఒక్కో మండలం/పట్టణం నుంచి ఇరవై మంది చొప్పున వంద మందితో ప్రగతి భవన్‌లో సమావేశం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. మంత్రి కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేస్తారని, అవసరమైతే సీఎం కేసీఆర్ కూడా సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ సమావేశాన్ని శుక్రవారమే నిర్వహించాల్సి ఉండగా.. మంత్రి ప్రశాంత్ రెడ్డి తల్లి మరణంతో కార్యక్రమాన్ని వాయిదా వేశారు.




క్షేత్ర స్థాయిలో..

కామారెడ్డి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గ్రౌండ్ వర్క్ ఇప్పటికే మొదలైంది. బూత్‌కు పది మందితో కమిటీని ఏర్పాటు చేసి, జాబితాను కంప్యూటరీకరిస్తారు. వారికి ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా సమాచారాన్ని చేరవేస్తారు. అలాగే సోషల్ మీడియాల టీంలను ఇప్పటికే అలర్ట్ చేశారు. ప్రభుత్వ పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇదే సమయంలో గత పాలకుల విధానాలతో జరిగిన ఇబ్బందులను వివరిస్తూ, ప్రస్తుతం జరిగిన మేలును కళ్లకు కట్టేలా రూపొందించిన వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.

ప్రత్యర్థి పార్టీల నేతలపై దృష్టి

కాంగ్రెస్, బీజేపీలలో క్రియాశీలకంగా ఉన్న నేతలపై బీఆర్‌ఎస్ నేతలు దృష్టి సారించారు. వారిని తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే బీజేపీకి చెందిన ఓ కౌన్సిలర్‌కు ఇటీవల కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పారు. మండలాలవారీగా నాయకుల జాబితాలను రూపొందించి వారిని ఏదోరకంగా కారెక్కించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

కామారెడ్డి క్యాంపెయిన్ ఇన్‌చార్జిగా కేటీఆర్


కేటీఆర్

- శేరి సుభాష్‌రెడ్డి, గంప గోవర్ధన్ కూడా...
- ఎల్లారెడ్డి బాధ్యతలు మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌కు..
- బోధన్, నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ కవిత


ఎమ్మెల్సీ కవిత


గంప గోవర్ధన్


వీజీ గౌడ్


శేరి సుభాష్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి పోరులో ముందున్న బీఆర్‌ఎస్.. తాజాగా పలు నియోజకవర్గాలకు ప్రచార ఇన్‌చార్జిలను ప్రకటించింది. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గం బాధ్యతను ముగ్గురికి అప్పగించింది.

మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ఎలక్షన్ క్యాంపెయిన్ ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ బాధ్యతలను మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌కు ఇచ్చారు. బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు ఇంకా ఎవరినీ నియమించలేదు. ఎమ్మెల్సీ కవితకు నిజామాబాద్ అర్బన్‌తోపాటు బోధన్ నియోజకవర్గాల ప్రచార బాధ్యతలు అప్పగించారు. క్యాంపెయిన్ ఇన్‌చార్జీల నాయకత్వంలో ఆయా నియోజకవర్గాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పరామర్శ


తల్లి మంజుల మృతదేహం వద్ద రోదిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్ : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజుల గురువారం మరణించారు. ఆమె మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామం వేల్పూర్‌కు తీసుకువచ్చారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితోపాటు పలువురు నేతలు, అధికారులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. శుక్రవారం అంత్యక్రియలు జరగనున్నాయి. అంత్యక్రియలలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని పార్టీ నాయకులు తెలిపారు.

‘కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి’


సుభాష్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు

దోమకొండ: పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో మండలానికి చెందిన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, ఎంపీపీ కానుగంటి శారద, జెడ్పీటీసీ సభ్యులు తిర్మల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, నాయకులు శంకర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, నాగరాజ్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాచారెడ్డి మండలంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జిల్లాలో గురువారం పండుగ సందడి మొదలైంది. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ పేర్చారు. గ్రామాలు, పట్టణాలలోని కూడళ్లతోపాటు పాఠశాలల్లోనూ బతుకమ్మ ఆడారు.

ఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు


ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డితో జిల్లా పోలీసులు

కామారెడ్డి క్రైం: జిల్లా ఎస్పీగా 22 నెలల పాటు పనిచేసే భాగ్యం దక్కినందుకు సంతోషంగా ఉందని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తాను మొదట బాన్సువాడ ఎస్సైగా విధులు నిర్వహించానని గుర్తుచేశారు. ఆ తర్వాత ఇక్కడే ఎస్పీగా పనిచేసే భాగ్యం కలిగిందన్నారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ బాగా పనిచేసి మంచి పేరు తీసుకువచ్చారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే పనితనాన్ని, స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ఇన్‌చార్జి ఎస్పీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రకాష్, జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

ఓటమి భయంతో కేసీఆర్‌కు చలి జ్వరం


మద్దికుంటలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

- కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

రామారెడ్డి: రాష్ట్రంలో అధికార పార్టీకి వ్యతిరేక పవనాలు వీస్తుండడంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చలి జ్వరం వచ్చిందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. గురువారం ఆయన మద్దికుంట గ్రామంలోని బుగ్గ రామలింగేశ్వర ఆలయాన్ని దర్శించి, పూజలు చేశారు. అనంతరం మద్దికుంటలో ఆయన మాట్లాడారు. ఎక్కడ సీఎం పీఠం దక్కదేమోనన్న భయంతో కేటీఆర్ మతిభ్రమించి రాష్ట్ర మొత్తం తిరుగుతూ పిచ్చికూతలు కూస్తున్నాడన్నారు. ప్రజల్లో వ్యతిరేకతను చూసి దిక్కుతోచని స్థితిలో బీఆర్‌ఎస్ పార్టీ ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో బుగ్గ రామలింగేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేశామని, అందుకే ఆలయానికి రాష్ట్ర స్థాయిలో మద్దికుంట గ్రామానికి గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన గంప గోవర్ధన్ తన అనుచరులతో కలిసి భూ కబ్జాలు చేశారని, కాంట్రాక్ట్‌ల రూపంలో ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపించారు. ఓటమి భయంతో పారిపోయిన ఆయన అభివృద్ధిని సాకుగా చూపి సీఎంను తీసుకువచ్చారన్నారు. కేసీఆర్‌ను ఓడించి బుద్ధి చెప్పే అవకాశం కామారెడ్డి ప్రజలకు వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, రామారెడ్డి జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సాగౌడ్, ప్రవీణ్, రాజు, లచ్చిరెడ్డి, తోట లింగం, నర్సారెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, నాసిలాల్ నాయక్, గొనె శ్రీనివాస్, గణేష్ నాయక్, సల్మాన్, కొమురయ్య పాల్గొన్నారు.

యువతరంలో తగ్గిన నారీశక్తి

ఆడపిల్లలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. భ్రూణ హత్యలు భవిష్యత్‌ను అంధకారంగా మార్చబోతున్నాయి. జిల్లాలో ఇప్పటికీ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నా.. యువతలో వారి నిష్పత్తి మాత్రం గణనీయంగా తగ్గింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు సాధించుకున్నామని సంబరాలు చేసుకుంటున్న సమయంలో మహిళా ఓటర్ల సంఖ్య క్రమక్రమంగా తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

– సాక్షి, కామారెడ్డి

- యువకుల ఓట్లే అధికం
- ఆందోళన కలిగిస్తున్న వ్యత్యాసం



ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ తమదైన ప్రతిభ చాటుతూ అంతరిక్షయానం చేస్తూ ఎవరెస్టంత ఎత్తుకు ఎదుగుతున్నారు. అయినా వారంటే ఇప్పటికీ వివక్షే.. ఆడపిల్ల అంటేనే భారం అన్న భయం, మగబిడ్డే వారసుడన్న భావన.. వెరసి పుట్టేది ఆడ శిశువు అని తెలియగానే గర్భంలోనే ఊపిరి తీస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని తెలిసినా.. పలుచోట్ల యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. ఫలితంగా ఆడపిల్లల జనాభా పడిపోతోంది. దీని ప్రభావం యువ ఓటర్ల సంఖ్యలో ప్రతిఫలిస్తోంది.

మహిళలే అధికం.. అయినా

జిల్లాలో మహిళా ఓటర్లే నిర్ణేతలుగా ఉన్నారని గొప్పగా చెప్పుకుంటున్నాం. జనాభాలోనూ వారే అధికంగా ఉన్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి మొత్తం ఓటర్లు 8,54,004 మంది ఉండగా.. ఇందులో మహిళా ఓటర్లు 4,40,630 మంది, పురుషులు 4,13,329 మంది, ఇతరులు 45 మంది ఉన్నారు. పురుషులకన్నా 27,301 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అయితే యువ ఓటర్ల దగ్గరకి వచ్చేసరికి పరిస్థితులు తలకిందులవుతున్నాయి. 18 –19 ఏళ్లలోపు ఓటర్లలో యువతుల సంఖ్య గణనీయంగా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. ఈ విభాగంలో మొత్తం 26,645 మంది ఓటర్లుండగా.. పురుషులు 15,635 మంది, మహిళలు 11,008 మంది ఉన్నారు. అంటే యువత ఓట్లలో యువకులకన్నా యువతులు 4,627 మంది తక్కువగా ఉన్నారని స్పష్టమవుతోంది. అలాగే 20 –29 ఏళ్ల విభాగంలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ కూడా మహిళా ఓటర్లు 5,127 మంది తక్కువగా ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటరు జాబితాలకు సంబంధించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

భవిష్యత్ ప్రశ్నార్థకం!?

యువ ఓటర్లలో యువతుల సంఖ్య తగ్గిపోయింది. ఇంకా 18 ఏళ్లలోపువారిలోనూ మగ పిల్లలకన్నా ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉంది. ప్రతి వెయ్యి మంది మగ పిల్లలకు 976 మందే ఆడపిల్లలు ఉన్నారు. మూడేళ్లలోపు పిల్లల్లో నిష్పత్తి మరింత దయనీయంగా ఉన్నట్లు తెలుస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుంది. ప్రభుత్వాలు ఆడపిల్లల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నా వివక్ష తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయంలో సామాజిక చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

18, 19 ఏళ్ల ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కామారెడ్డి	3976	2972	01	6949
ఎల్లారెడ్డి	4102	2549	01	6652
బాన్సువాడ	3596	2669	00	6265
జుక్కల్	3961	2818	00	6779
మొత్తం	15,635	11,008	02	26,645

20-29 ఏళ్లలోపు ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కామారెడ్డి	25,081	24,656	13	49,750
ఎల్లారెడ్డి	24,010	21,474	02	45,486
బాన్సువాడ	20,567	20,704	00	41,271
జుక్కల్	22,262	19,959	05	42,226
మొత్తం	91,920	86,793	20	1,78,733

క్లుప్తంగా

తెయూ సీవోఈ పదవీకాలం పొడిగింపు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి (సీవోఈ) ఎం అరుణ పదవీకాలాన్ని పొడిగించారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి గురువారం అరుణకు పదవీకాలం పొడిగింపు ఉత్తర్వులు అందజేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఆమె కంట్రోలర్ బాధ్యతల్లో కొనసాగుతారని తెలిపారు.

దిగుబడి అంచనాకు పంట కోత ప్రయోగం



బోధన్: ఎకరంలో వచ్చే దిగుబడిపై అంచనాకు వచ్చేందుకు పంట కోత ప్రయోగ కార్యక్రమం చేపట్టామని జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. ఈ ప్రయోగంతో మండల, జిల్లా స్థాయిలో వచ్చే వరి పంట దిగుబడిని అంచనా వేయవచ్చని పేర్కొన్నారు. గురువారం బోధన్ మండలం పెంటాకుర్దు శివారులో రైతు శేఖర్ పొలంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. కోసిన పంటను నూర్పిడి చేసి ధాన్యాన్ని తూకం వేశారు. ఏఈవో సాయి చరణ్, రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



రెంజల్: సీసీ కెమెరాలతో దొంగతనాలను నివారించవచ్చని బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని బోర్గాం గ్రామస్తులకు సూచించారు. గురువారం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ధ్రువపత్రాలు లేని 45 వాహనాలను సీజ్ చేశారు. రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, రెంజల్, ఎడపల్లి, రుద్రూర్ ఎస్సైలు ఉదయ్‌కుమార్, విక్రమ్, నీరేష్ పాల్గొన్నారు.

పసుపు పంట పరిశీలన



బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్‌లో పసుపు పంటను కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మహేందర్, పసుపు పరిశోధన శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఆయన పంట దిగుబడి, మార్కెటింగ్ ప్రణాళికల గురించి రైతులకు వివరించారు. సస్యరక్షణ చర్యలు వివరించారు. శ్రీనివాస్, పాలెం ప్రవీణ్, మధు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతి


లహరి(ఫైల్)

నిజాంసాగర్: అచ్చంపేట మోడల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లహరి(15) గురువారం మృతి చెందింది. ఒడ్డేపల్లి గ్రామానికి చెందిన గాయత్రి, బాబాగౌడ్ దంపతుల పెద్ద కూతురు లహరి మోడల్ పాఠశాలలో చదువుతోంది. 15 రోజుల కిందట వైరల్ ఫీవర్ రావడంతో లహరిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. జ్వరం తగ్గుముఖం పట్టగా నిమోనియా అటాక్ కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది.

జోరుగా కల్తీకల్లు దందా!

- బానిసవుతున్న యువత
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

నిజామాబాద్‌రూరల్: జిల్లాలో కల్తీకల్లు దందా జోరుగా సాగుతోంది. గుల్బారం కల్లును యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కూలీ పనులు చేసుకునే వారు, రోజంతా కాయకష్టం చేసేవారు రాత్రి నిద్ర కోసం కల్లు తాగుతారు. అయితే ఈ కల్లును డైజోఫాం, క్లోరోఫాం, ఈస్ట్ లాంటి రసాయనాలతో తయారు చేస్తున్నారు. మద్యం కంటే తక్కువకు ధరకు దొరకుతున్న కృత్రిమ కల్లుకు యువత సైతం బానిసై మత్తులో మునిగి తేలుతున్నారు. గ్రామాల్లో అడుగు అడుగున కృత్రిమ కల్లు దుకాణాలు వెలిసి సామాన్య ప్రజలకు రోజు కృత్రిమ కల్లు తాగడం అలవాటుగా మారింది. దినసరి కూలీల నుంచి జాబ్‌లు చేసే వారి వరకు కల్తీ కల్లుకు బానిసలు అవుతున్నారు. రోజంతా కాయ కష్టం చేసి ఒక సీసా గుల్‌ఫారం కల్లు తాగితే నిద్రవస్తుందని కొందరు అలవాటుగా మార్చుకున్నారు. అక్టోబర్ 1 నుంచి కొత్త మస్తేదార్‌లు వచ్చారు. వీడీసీలకు ఏడాది డబ్బు కడితే చాలు.. వారు ఏది అమ్మినా పట్టించుకునే వారు కరువయ్యారు.

దొరక్కపోతే ఇబ్బంది

నిత్యం కల్తీ కల్లు తాగే వారు ఒకరోజు అది దొరక్కపోతే వింతగా ప్రవర్తిస్తారు. కల్లు దొరక్క చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. అయితే ఇక్కడ గ్రామాల్లో కల్లుకు అలవాటు పడ్డ వారు గల్ఫ్ దేశాలకు వెళ్లిన సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. బతుకు దెరువు కోసం తల్లిదండ్రులు, భార్యపిల్లలు, స్నేహితులను వదిలి ఉంటున్న వారు కల్లు లేకపోతే ఉండలేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ కల్లు, మద్యం దొరక్క పలువురు మతిస్థిమితం కోల్పోతే మరికొందరు ఇంటి బాట పట్టిన సందర్భాలు ఉన్నాయి. గల్ఫ్ వెళ్లేవారు రెండు మూడు నెలల ముందు నుంచే ఇక్కడ కల్లు అలవాటు మానుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

డిచ్‌పల్లి మండలం గొల్లపల్లికి చెందిన ఓ యువకుడు గల్ఫ్ దేశానికి వెళ్లాడు. ఇక్కడ ఉన్న సమయంలో ఆయనకు గుల్బారం కల్లు అలవాటు ఉంది. గల్ఫ్ వెళ్లాక అక్కడ కల్లు దొరక్క మతిస్థిమితం కోల్పోయి ఎడారుల్లో తిరుగుతూ ప్రాణాలు కోల్పోయాడు. మూడు నెలల తరువాత అతని మృతదేహం స్వగ్రామానికి వచ్చింది. బర్ధీపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి కుడా గల్ఫ్‌లో కల్లు దొరక్క తిరిగి ఇంటికి వచ్చాడు. ఇలా ఎంతో మంది కల్తీ కల్లుకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.


బట్టీలో తయారు చేసిన కల్లు

చర్యలు శూన్యం

గ్రామాల్లో గుల్‌ఫారం, కృత్రిమ కల్లు తయారు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ముస్తేదార్‌లు అందజేసే మాముళ్లు తీసుకొని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక పోలీస్‌లకు కూడా మాముళ్లు ముడుతున్నట్లు సమాచారం. దీంతో కల్లు బట్టీల్లో తనిఖీలు చేసే వారు కరువయ్యారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. గుల్‌ఫారం, కృత్రిమ కల్లుకు పలువురు బానిసలవుతున్నారు. ఇది ఆరోగ్యానికి హానికరం. యువత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి.

– కేశవులు, సైకాలజిస్టు

చర్యలు తీసుకుంటాం

ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్స్, ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో కల్లు బట్టీలపై దాడులు కొనసాగుతున్నాయి. కల్లు బట్టీల్లో కృత్రిమ కల్లు తయారీని అడ్డుకుంటాం. దీనిపై కల్తీ కల్లు తయారు చేసే ముస్తెదార్ల లైసెన్స్‌లు రద్దు చేసి, కల్లు బట్టీలను మూసివేస్తాం.

– సింధు, ఎక్సైజ్ సీఐ

మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి లక్ష్మణ్ సింగ్


రామారెడ్డిలో మాట్లాడుతున్న లక్ష్మణ్ సింగ్

రామారెడ్డి(ఎల్లారెడ్డి): మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు అని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి లక్ష్మణ్ సింగ్ అన్నారు. గురువారం రామారెడ్డి రైతు వేదికలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి లక్ష్మణ్ సింగ్ ,జిల్లా మానసిక వైద్యాధికారి జి.రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమయ్యే ముఖ్యమైన కార్యక్రమాల విశిష్టతలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఆ బాధ్యతలను ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తీసుకోవాలని అన్నారు. మానసిక ఆరోగ్యమే మహాబలమని అన్నారు. జిల్లా మానసిక వైద్య ఆరోగ్య అధికారి రమణ మాట్లాడుతూ..మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగినప్పుడు, సమాజంలో, కుటుంబంలో ఏర్పడి తీవ్ర వ్యతిరేకత వల్ల ఆ వ్యక్తులు మానసిక ఆందోళనల ద్వారా మానసిక అనారోగ్యాలకు గురవుతున్నారని అలా జరగకుండా చూసుకోవాలని కోరారు. జిల్లా మానసిక సామాజిక కార్యకర్త రాహుల్ కుమార్, హెల్త్ సూపర్ వైజర్ భీమ్, జానకి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను సంపూర్ణంగా నిర్మూలిద్దాం

జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి శ్రీదేవి


రాజంపేటలో బాల్యవివాహాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి, విద్యార్థులు

రాజంపేట: బాల్యవివాహాలను సంపూర్ణంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కామారెడ్డి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి శ్రీదేవి అన్నారు. గురువారం బాల్య వివాహ రహిత భారతదేశం అనే అంశంపై రాజంపేట మండల కేంద్రంలో సాధన సంస్థ, జిల్లా న్యాయసేవ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల కార్మికులు లేని జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు తాము చేసుకోబోమని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. జిల్లా సివిల్ జడ్జి భార్గవి మాట్లాడుతూ.. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులకు జరిమానా విధించడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీడబ్ల్యూసీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులు ఇష్టపడి చదివి సమాజంలో ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. బాలల హక్కులను సంపూర్ణంగా పరిరక్షిస్తామని పేర్కొన్నారు.జిల్లాలో 50 గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాధన సంస్థ డైరెక్టర్ మురళీ మోహన్ మాట్లాడుతూ.. జిల్లాలో బాలల హక్కుల గురించి తమ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. బాల్య వివాహాలను శాశ్వతంగా నిర్మూలిస్తామని సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో బచ్పన్ బచావో ఆందోళన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ చందన, అధికారి బావయ్య, జిల్లా బాలికల పరిరక్షణ అధికారిణి స్రవంతి, ఎంపీడీవో బాల కిషన్, తహసీల్దార్ అనిల్ కుమార్, మండల విద్యాధికారి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు .


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కియా కార్ల షోరూం ప్రారంభం


కియా షోరూంను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ శివారులో సన్‌రైజ్ కియా షోరూంను గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కియా ఇండియా రీజినల్ మేనేజర్ జోంఫే రియూతో కలిసి ప్రారంభించారు. స్పీకర్ మాట్లాడుతూ.. వాహన రంగంలో తెలంగాణ అద్భుతంగా దూసుకెళ్తోందని, ఇందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు కారణమని తెలిపారు. కియా వంటి అంతర్జాతీయంగా పేరొందిన ఆటోమొబైల్ కంపెనీ జిల్లాలో షోరూం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కియా ఇండియా రీజినల్ మేనేజర్ జోంఫే రియూ కియా కారు ప్రత్యేకతలను వివరించారు. సన్‌రైజ్ కియా షోరూం చైర్మన్ పోచారం సురేందర్‌రెడ్డి, ఎండీ జీ రవికిరణ్‌గౌడ్, ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, హన్మంత్ సింధే, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మేయర్ దండు నీతూకిరణ్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, షోరూం మేనేజర్ సతీష్, నాయకులు చింత శ్రీనివాస్‌రెడ్డి, దాసరి లక్ష్మీనర్సయ్య, కృష్ణ, దండు గుల సాయిలు, నీరడి పద్మారావు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపిక

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధి లో నిర్వహించిన వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్–2024 పోటీల్లో నలుగురు వలంటీర్లు ఎంపికైనట్టు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి గురువారం తెలిపారు. పరేడ్‌కు ఎంపికైన వారిలో జాదవ్ మమత (గిరిరాజ్ కాలేజీ, నిజామాబాద్), మలావత్ సరిత (గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీ, నాగారం), మంద ప్రవీణ (నిశిత డిగ్రీ కాలేజీ, నిజామాబాద్), కుంచర్ల హారిక (సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీ, ఆర్మూర్) ఉన్నారు. వీరికి నవంబర్ 1 నుంచి 10 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో ప్రత్యేక శిక్షణనిస్తారని రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను తెయూ రిజిస్ట్రార్ ఎం యాదగిరి అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎడపల్లి: మండలంలోని ఎమ్మెస్సీ ఫారం వద్ద గురువారం పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. నిజామాబాద్ వైపు నుంచి బోధన్ వైపు అశోక్ లైలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. డ్రైవర్ అయూబ్ ఖాన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్ తీగలు పడి మహిళకు గాయాలు


చికిత్స పొందుతున్న కళావతి

నిజామాబాద్ రూరల్: విద్యుత్ వైర్లు తెగిపడి మండలంలోని కాలూర్ గ్రామానికి చెందిన కళావతి గాయపడింది. వివరాలు.. కళావతి పొలానికి వెళ్లిన సమయంలో పైనున్న తీగలు తెగిపడ్డాయి. తీవ్రంగా గాయపడ్డ ఆమెను నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు విద్యుత్ అధికారులే నిర్లక్ష్యమని గ్రామస్తులు ఆరోపించారు.

వివాహిత అదృశ్యం

మాక్లూర్: మండలంలోని రాంచంద్రపల్లిలోని ఒడ్డెర కాలనీకి చెందిన ముదుగుల హేమలత (35) ఈ నెల 4 నుంచి కనిపించడం లేదని ఆమె భర్త శంకర్ గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. కాలనీ నుంచి గుత్ప తండాకు కూలీ పనులకని వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

రుద్రూర్: రుద్రూర్ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్, ఆయిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్టు ఎస్సై నీరేష్ తెలిపారు. బుధవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ కాయిల్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై స్థానిక రైతులు గురువారం ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అనిల్(ఫైల్)

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి శివారులో విశ్వ అగ్రోటెక్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రయాన్‌పల్లికి చెందిన అనిల్(33) మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు.. అనిల్ బుధవారం సాయంత్రం డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామానికి బైక్‌పై వెళ్లి వస్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డ ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య నవనీత ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని ఒకరు..

కామారెడ్డి క్రైం: కారు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ బైపాస్ సమీపంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు.. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామానికి చెందిన దూదెకుల బాబు (55) సెంట్రింగ్ పనుల నిమిత్తం కామారెడ్డికి వచ్చాడు. ఉదయం 7 గంటల ప్రాంతంలో టేక్రియాల్ సమీపంలో నడుచుకుంటు వెళ్తుండగా నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి అతడిని వెనక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడి తమ్ముని కుమారుడు సలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

తమ్ముడు జైలుకు వెళ్లాడని అన్న ఆత్మహత్య


నిషాంత్(ఫైల్)

భిక్కనూరు: చోరీ కేసులో తమ్ముడు అరెస్టై జైలుకు వెళ్లడంతో అవమానంగా భావించిన అన్న ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లిలో గురువారం ఈ సంఘటన జరిగింది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగంపల్లి గ్రామానికి చెందిన తిప్పని నిషాంత్ (23) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి తమ్ముడు నితిన్ చోరీ కేసులో 15 రోజుల క్రితం అరెస్టై జైలులో ఉన్నాడు. అప్పటి నుంచి నిషాంత్ అవమానభారంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నిషాంత్ రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం పొలం వద్దకు వెళ్లగా అక్కడ నిషాంత్ మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. మృతుడి తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..


తిర్మల్‌రెడ్డి మృతదేహం

భిక్కనూరు: మండలంలోని కంచర్లకు చెందిన తిర్మల్‌రెడ్డి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన మడప తిర్మల్‌రెడ్డి (45) కొన్ని రోజులుగా అప్పులు బాగా అయ్యాయని మదన పడుతుండేవాడు. బుధవారం సాయంత్రం తన పొలం వద్దకు వెళ్లి అక్కడ ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం వేకువ జామున చుట్టుపక్కల రైతులు దీన్ని చూసి తిర్మల్‌రెడ్డి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు అరవింద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎడపల్లి: మండలంలోని షాటాపూర్ గేటు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎడపల్లికి చెందిన సుధాకర్(42) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సుధాకర్ బుధవారం ఎడపల్లి నుంచి నిజామాబాద్ వెళ్తుండగా టాటా ఎస్ వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు.

ఏటీఎంల చోరీకి యత్నించిన నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి సీపీ జయరాం

ఖలీల్‌వాడి: రెండు ఏటీఎంలలో చోరీకి యత్నించిన ముగ్గురిని, వారికి సహకరించిన మహిళను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి సీపీ జయరామ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ గ్రామంలోని నంబర్ వన్ ఏటీఎంలో సెప్టెంబర్ 8న రాత్రి జక్రాన్‌పల్లికి చెందిన అల్లేపు స్వామి, దేవేందర్, ఆర్మూర్‌కు చెందిన నవీన్ చోరీకి యత్నించారు. అంతకుముందు వారు ఆర్మూర్ మండలం మచ్చర్లలో బైక్ దొంగతనం చేసి బడాభీమ్‌గల్ వెళ్లారు. అక్కడ ఏటీఎంలో చోరీకి యత్నించగా నగదు ఉన్న బాక్స్ ఓపెన్ కాలేదు. దీంతో అక్కడి నుంచి వారు పారిపోయారు. అక్టోబర్ 10న వేల్పూర్ మండలం అంక్సాపూర్‌లో ఈ ముగ్గురు నిందితులు యూనియన్ బ్యాంక్ ఏటీఎంను చోరీ చేయాలని పథకం వేశారు. ముందుగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్, ట్రాలీ ఎత్తుకెళ్లి వాటిలో ఏటీఎంను తీసుకెళ్లాలని ప్లాన్ వేశారు. ఏటీఎంను పగులగొట్టి అందులో డబ్బులు ఉన్న బాక్స్‌ను ట్రాక్టర్‌లోకి పెట్టే సమయంలో చుట్టు పక్కల నుంచి శబ్దం రావడంతో వాటిని అక్కడే వదిలి పారిపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. వీరిపై ఇళ్లలో బంగారం దొంగతనం చేసిన కేసులు ఉన్నాయి. వీరు చోరీ చేసిన బంగారాన్ని అల్లేపు స్వామి భార్య శైలజ అమ్మి పెట్టేంది. దీంతో నలుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ జగదీశ్ చందర్, సీసీఎస్ ఏసీపీ విజయసారథి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు హరి బాబు, రాజ శేఖర్ ఉన్నారు.

పోచంపాడ్ ఏటీఎం చోరీ కేసులో ఒకరు..

మెండోరా మండలం పోచంపాడ్‌లో ఏటీఎంలో చోరీకి పాల్పడిన ఒకరిని అరెస్ట్ చేశామని, ఈ కేసులో మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు ఇన్‌చార్జి సీపీ జయరామ్ తెలిపారు. హర్యానాకు చెందిన జన్రైల్, అఫ్జల్ అలియాస్ అబ్దుల్, సాజిద్ అలియాస్ షాంతూ, సాబిర్, హనీఫ్, హనీఫ్ త్వరగా డబ్బు సంపాదించడానికి చోరీలు చేయాలని పథకం పన్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 27న డిచ్‌పల్లిలో బైక్ దొంగతనం చేశారు. కొంతదూరం వెళ్లిన తర్వాత కారు చోరీ చేశారు. దానిలో నిర్మల్ వెళ్తుండగా దూదిగాం దగ్గర ఎన్‌హెచ్–44 పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం షట్టర్ తాళాలు పగులగొట్టారు. అందులోని రూ.12,46,500 నగదు చోరీ చేశారు. పోచంపాడ్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యం గాలింపు చేపట్టారు. జన్రైల్ తన లారీని ఔరంగాబాద్‌లో టమాట లోడ్‌కు పెట్టి మిగతా నిందితులతో హర్యానాకు వెళ్లారు. గురువారం లారీలో జన్రైల్ నిజామాబాద్‌కు వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. లారీని స్వాధీనం చేసుకొని, మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీపీ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నిజామాబాద్‌రూరల్: మండలంలోని మల్కాపూర్, గొల్లగుట్ట తండా, చక్రధర్‌నగర్ తండా, నాగరం తండాల్లో దాడులు చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథం తెలిపారు. ఈ దాడుల్లో గుడుంబా తయారీకి ఉపయోగించే 600 లీటర్ల బెల్లం పానకం పట్టుకొని ధ్వంసం చేశామన్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్, సూపరింటెండెంట్ మల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపుపై..

నవీపేట: మండలంలోని ఆశాజ్యోతి కాలనీలో గురువారం జరిపిన దాడిలో లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. బాలరాజు గౌడ్‌కు చెందిన కిరాణా షాపులో రూ.నాలుగు వేల విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

బస్టాండ్‌లో దొంగల హల్‌చల్


పోలీసులతో మాట్లాడుతున్న బాధితురాలు లక్ష్మి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి బస్టాండ్‌లో దొంగలు రెచ్చిపోతున్నారు. ఓ మహిళా బ్యాగులో ఉన్న 14 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. వివరాలు.. సిరిసిల్లకు చెందిన నాంపల్లి లక్ష్మీ కామారెడ్డికి వచ్చి తిరిగి వెళ్లేందుకు కొత్త బస్టాండ్‌కు వచ్చింది. వాటర్ బాటిల్‌ను కొనేందుకు ఓ దుకాణం వద్దకు వెళ్లింది. బాటిల్ కొనేలోపు పక్కనే ఉంచిన బ్యాగు చోరీకి గురైంది. అందులో 14 తులాల బంగారం ఉన్నట్లు బాధితురాలు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే మరో ప్రయాణికుడి జేబులో నుంచి రూ.10 వేల వరకు దొంగలు చోరి చేసినట్లు అక్కడ ఉన్నవారు తెలిపారు.

పోలీసుల అదుపులో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా!

నిజాంసాగర్(జుక్కల్): ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, కాపర్ వైర్లు, ఆయిల్ చోరీ చేస్తున్న దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాలతో పాటు మరికొన్ని జిల్లాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు చేస్తున్న నలుగురిని బాన్సువాడ సర్కిల్‌తో పాటు నిజాంసాగర్ పోలీసులు పట్టుకున్నారు. జహీరాబాద్ ప్రాంతానికి చెందిన నలుగురు ఏడాదిగా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల నిజాంసాగర్ మండలం ఆరేడ్ గ్రామ శివారులో మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు స్థానిక రైతులు, ట్రాన్స్‌కో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న బాన్సువాడ రూరల్ సీఐ మురళి దొంగల కోసం గాలించారు. ఈ క్రమంలో జహీరాబాద్ ప్రాంతానికి చెందిన అనుమానితులను పట్టుకొని విచారించడంతో నేరం ఒప్పుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన నిందితులను స్పెషల పార్టీ పోలీసులు, బాన్సువాడ డీఎస్పీ, సీఐ ఆధ్వర్యంలో విచారిస్తున్నట్లు సమాచారం.